## క్లుప్తంగా

### మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

బోట్‌క్లబ్‌: మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని ఇండియన్‌ డెంటల్‌ అసోసియేషన్‌ రాష్ట్ర కన్వీనర్‌ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న సత్య దంత వైద్యశాలలో మంగళవారం ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం , అంతర్జాతీయ మహిళల ఆరోగ్య సంరక్షణ దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు పద్మావతి దీప ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి వారి ఆరోగ్య సంరక్షణకు అవగాహన కల్పించారు. పద్మావతి మాట్లాడుతూ స్త్రీలందరికీ రుతుక్రమ పరిశుభ్రత చాలా ముఖ్యమైనదన్నారు. రుతు పరిశుభ్రత సరిగా లేకపోవడంతో, వారు అనేక తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, చైతన్య, నిఖిల, భవానీ తదితరులు పాల్గొన్నారు.

### ఒకటిన హనుమజ్జయంతి

బోట్‌క్లబ్‌: స్థానిక రిజర్వులైన్‌ అయ్యప్పస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా జూలై 1న ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు గంటలకు పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ, పంచమాలతో అలంకరణ, తమలపాకుల పూజ జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు సామూహిక హనుమాన్‌ పూజ, సాయంత్రం 6 గంటలకు సామూహిక హనుమాన్‌ చాలీసా పారాయణ నిర్వహించనున్నామని, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

### మెగా రిటైల్‌ ఎక్స్‌పోకు విశేష స్పందన



రుణ మంజూరు పత్రాలు అందిస్తున్న యూనియన్‌ బ్యాంకు అధికారులు

బోట్‌క్లబ్‌: యూనియన్‌ బ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక కృషి భవన్‌లో మంగళవారం నిర్వహించిన మెగా రిటైల్‌ ఎక్స్‌పోకు విశేష స్పందన లభించింది. ఈ ఎక్స్‌పోను బ్యాంక్‌ జోన్‌ హెడ్‌ శంకరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అనుగుణంగా బ్యాంక్‌ సేవలందిస్తుందని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రీజనల్‌ హెడ్‌ సాయి మనోహర్‌ మాట్లాడుతూ బ్యాంకు అతి తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తుందన్నారు. అనంతరం రుణాలు మంజూరుచేసిన వారికి రుణమంజూరు పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్‌ డిప్యూటీ రీజినల్‌ హెడ్‌ నారాయణ, జరీనా, ప్రముఖ వ్యాపారవేత్తలు, బిల్డర్లు, సోలార్‌ డీలర్లు, అధిక సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.

### అపర్ణాదేవికి ఆమ్రఫలాలంకరణ



ప్రత్యేక అలంకరణలో అపర్ణాదేవి అమ్మవారు

గొల్లప్రోలు: వైశాఖ మాస బహుళ పంచమిని పురస్కరించుకుని మంగళవారం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి, అమ్మవారిని మామిడిపండ్లు, పుష్పమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా సహస్రనామ కుంకుమార్చన, అష్టోత్తర శతనామ కుంకమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### నేటి నుంచి జాతర



జి.మేడపాడులోని మహాలక్ష్మి అమ్మవారు

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు గ్రామంలో వేంచేసి ఉన్న మహాలక్ష్మీ, పోలమ్మ అమ్మవార్ల జాతర బుధవారం నుంచి మూడు రోజులు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మోరంపూడి శ్రీరంగనాయకులు తెలిపారు. వైశాఖ మాసం షష్ఠిని పురస్కరించుకుని ఏటా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. దీనిలో భాగంగా బుధవారం సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర నిర్వహిస్తామన్నారు. గురువారం నుంచి అమ్మవార్లను భక్తులు దర్శించుకుంటారని చెప్పారు. ఉత్సవాల ముగింపు రోజున అన్నదానం చేయనున్నట్టు తెలిపారు.

# శిక్షణ ఇష్టంగా..

- ఆడుతూ పాడుతూ చదువులు
- గ్రంథాలయాల బాట పట్టిన చిన్నారులు
- విశేష ఆదరణ పొందుతున్న వేసవి శిబిరాలు




పేపర్‌ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: ఒకప్పుడు వేసవి సెలవులు అంటే పూర్తిగా క్రీడలకు మాత్రమే కేటాయించేవారు. కానీ ఈ ఐదేళ్ల కాలంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గ్రంథాలయాలకు కొత్త కళ తీసుకువచ్చి వాటిని సద్వినియోగం చేసుకునే దిశగా కృషి చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాలకు కోట్లు వెచ్చించి పుస్తకాలు కొనుగోలు చేశారు. వీటిని అన్ని గ్రంథాలయాలకు పంపిణీ చేయగా నగరంలో ఉన్న ప్రధాన గ్రంథాలయంతో పాటు మూడు ఉప గ్రంథాలయాలకు, ఎనిమిది పుస్తక నిక్షిప్త కేంద్రాలకు సరఫరా చేశారు. ప్రధాన గ్రంథాలయంలో 1800, గాంధీగనగర్‌ బ్రాంచ్‌కు 1820, జగన్నాథపురం 600, ఆనందభారతి గ్రౌండ్‌ గ్రంథాలయానికి 600 పుస్తకాలు ఉంచారు. కొత్తగా వచ్చిన పుస్తకాలు చిన్నారులు, విద్యార్థులను కట్టిపడేస్తున్నాయి. గ్రంథాలయాల సమీపాల్లో ఉన్న చిన్నారులు, విద్యార్థులు దాదాపు అర గంట నుంచి గంట సేపు తమకు ఇష్టమైన పుస్తకాలు చదువుతున్నారు. కొత్తగా వచ్చిన పుస్తకాల్లో కథల పుస్తకాలతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలు, పాలిటెక్నిక్‌, ఎంసెట్‌, లాసెట్‌, వంటి ప్రవేశ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు ఆధ్యాత్మికం, వినోదం పంచే పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి.


**జూన్‌ 7 వరకూ వేసవి శిబిరం**

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్‌, ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల 15వ తేదీ నుంచి వేసవి శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేసి ప్రారంభించారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల సమయం వృథా కాకుండా వారిలో పఠనాసక్తిని కలిగించడం, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించడం, విద్యార్థులను ఆకట్టుకునేలా వివిధ అంశాలపై 40 రోజులు శిక్షణ ఇచ్చేందుకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. జూన్‌ ఏడో తేదీ వరకూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించనున్నారు. వివరాలకు సమీప గ్రంథాలయాలకు వెళ్లి సంప్రదించాల్సి ఉంటుంది. వివిధ సంస్థలకు చెందిన నిపుణులు తరగతులు బోధిస్తున్నారు.

పఠనం, సరదా అనే రెండు విభాగాల్లో శిక్షణ ఉంటుంది. పుస్తక పఠనం, కథలు చెప్పించడం, ప్రముఖులతో అవగాహన సదస్సులు, ఆటలపై ఆసక్తి ఉన్న వారికి చెస్‌, క్యారెమ్స్‌ ఏర్పాటు చేస్తున్నారు. విజేతల పుస్తకాలతో పాటు కవులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలు, వివిధ దినపత్రికలు, చిన్నారులకు ఉపయోగపడే పుస్తకాలు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేశారు. నృత్యం, పప్పెట్ల తయారీ వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నారు. స్పోకెన్‌ ఇంగ్లిష్‌, చెస్‌, డ్రాయింగ్‌, తెలుగు పండితుల నుంచి మంచి ప్రతిభ ఉన్నవారు ఈ గ్రంథాలయాల ద్వారా స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు రావాలని కోరుతున్నారు.



డాన్స్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు




నీటి ఆవశ్యకత వివరిస్తూ గీసిన చిత్రం

**ఆసక్తి గల అంశాలపై శిక్షణ**



చిన్నారులకు ఆసక్తి గల అంశాలపై శిక్షణ ఇస్తున్నాము. చిత్ర లేఖనం, వృత్తి శిక్షణ కోర్సులు చేసిన వారు గ్రంథాలయాల్లో విద్యార్థులకు సమయం కేటాయించేందుకు ముందుకు రావాలి. పాఠశాలల నుంచి విద్యార్థుల ఫోన్‌ నెంబర్లు సేకరించి శిక్షణ శిబిరాలకు వచ్చేలా సమాచారం అందజేస్తున్నాం. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి

– ములంపాక శ్రీనివాసరావు, లైబ్రేరియన్‌, గాంధీనగర్‌



ఓట్ల లెక్కింపు సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్వో వెంకటరావు



శిక్షణ పొందుతున్న సిబ్బంది



భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్వో వెంకటరావు

# 17 రౌండ్లలో ఓట్ల లెక్కింపు

- మొత్తం 14 టేబుళ్ల ఏర్పాటు
- పోస్టల్‌ బ్యాలట్‌కు 4
- ఆర్‌ఓ వెంకటరావు వెల్లడి

కాకినాడ: వచ్చేనెల నాలుగో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపులో భాగంగా కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి 17 రౌండ్లలో పూర్తవుతుందని రిటర్నింగ్‌ అధికారి జె.వెంకటరావు తెలిపారు. ఇందుకోసం జేఎన్‌ టీయూకే ఆవరణలో సివిల్‌ బ్లాక్‌ వద్ద 14 టేబుళ్లను ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే, మరో నాలుగు నాలుగు టేబుళ్లను పోస్టల్‌ బ్యాలట్‌ కోసం, మరో టేబుల్‌ను సర్వీస్‌ ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేశామని వివరించారు. స్థానిక స్మార్ట్‌ సిటీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఓట్ల లెక్కింపునకు నియామకమైన సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ వెంకటరావు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి చేపట్టాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జూన్‌ 4వ తేదీ ఉదయం 8 గంటలకు పోస్టల్‌ బ్యాలట్‌ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు. మరో అరగంట వ్యవధిలో వీవీ ప్యాట్లను తెరిచి, లెక్కింపు మొదలు పెడతామని తెలిపారు. 17 రౌండ్ల లెక్కింపు అనంతరం డ్రా పద్ధతిపై ఐదు పోలింగ్‌ బూత్‌లను ఎంపిక చేసి వాటిలో పడ్డ స్లిప్పులను కూడా కౌంటింగ్‌ చేస్తామని వివరించారు. దీనికోసం పాటించాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్‌ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్‌ గుంటూరు శేఖర్‌, ఏఆర్‌ఓ చల్లన్న దొర, స్మార్ట్‌ సిటీ ఎస్‌ఈ ఎం.వెంకటరావు, డీసీపీ హరిదాసు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

**కౌంటింగ్‌ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు**

ఎన్నికల కౌంటింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి వెంకట్రావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక జేఎన్‌టీయూకే ఆవరణలో ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్‌ రూములను సందర్శించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. విధుల్లో ఉన్న పోలీస్‌, ఇతర ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ స్ట్రాంగ్‌ రూముల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని వివరించారు. కేంద్ర బలగాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌ పోలీసుల ద్వారా స్ట్రాంగ్‌ రూములపై నిరంతర నిఘా ఉంచామన్నారు. అలాగే స్ట్రాంగ్‌ రూముల పరిసరాల్లో సీసీ కెమెరాలతో కూడా నిఘా ఉంచామని, వీటన్నింటినీ పర్యవేక్షించేందుకు ఇద్దరు గెజిటెడ్‌ అధికారులను కూడా నియమించామని తెలిపారు. అనంతరం జేఎన్‌టీయూకే ఆవరణలోని కౌంటింగ్‌ కేంద్రాన్ని కూడా ఆర్‌ఓ పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించి విధుల్లో ఉన్న సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కౌంటింగ్‌ నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

### ఉపాధి ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించాలి



ఉపాధికూలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సుబ్బారావు

కరప: వేసవిలో ఉపాధికూలీలకు టెంట్‌, తాగునీటి వసతి, మెడికల్‌ కిట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్‌ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్‌ చేశారు. మండలం వాకాడలో మంగళవారం ఆయన పర్యటించి, అక్కడ జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని జరిగే ప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాలని, ఎవరైన మరణిస్తే రూ.5 లక్షల బీమా ఇవ్వాలని సుబ్బారావు డిమాండ్‌ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.ఈశ్వరరావు, కేఎస్‌ శ్రీనివాస్‌, మండలశాఖ నాయకులు చోడిశెట్టి కృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు తలసేమియా ఆరోగ్య పరీక్షలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్‌ వీణ అక్కినేని

కాకినాడ సిటీ: అంతర్జాతీయ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకినాడ రెడ్‌క్రాస్‌ తలసేమియా కేంద్రంలో మంగళవారం విజయవాడ రెయిన్‌బో చిల్డ్రన్స్‌ హాస్పిటల్‌ వైద్య బృందం సహకారంతో ఆ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తలసేమియా బాధిత చిన్నారులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చిన్న పిల్లల వైద్య నిపుణులు, కన్సల్టెంట్‌ పిడియాట్రిక్‌ హెమటో ఆంకాలజిస్ట్‌ వైద్యులు వీణ అక్కినేని పాల్గొని మాట్లాడారు. దేశంలో తలసేమియా కేసులు పెరగటానికి ముఖ్యకారణం ప్రజల్లో వ్యాధి పట్ల సరైన అవగాహన లేకపోవడమే అన్నారు. 6 నెలల నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలు రక్తహీనతతో బాధపడుతూ ఉంటే వైద్యుల సలహా మేరకు తలసేమియా, హిమోఫీలియా వంటి స్క్రీనింగ్‌ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రెడ్‌క్రాస్‌ జిల్లా చైర్మన్‌ వైడీ రామారావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్‌ తలసేమియా కేంద్రం 2017లో ప్రారంభించామని అప్పటి నుంచి నిరంతరంగా పిల్లలకు ఉచితంగా రక్తాన్ని ఎక్కిస్తూ, ఉచితంగా మందులు, ఆహారం, రవాణా ఖర్చులు కూడా అందిస్తూ వారిపై మరింత భారాన్ని తగ్గించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌ కార్యదర్శి కె.శివకుమార్‌, వైద్యులు పి.దుర్గరాజు, వి.రామకృష్ణ, పరాశర తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్‌ ఏజెంట్లు నిబంధనలు పాటించాలి



కౌంటింగ్‌ ఏజెంట్లకు సూచనలిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: కౌంటింగ్‌ ప్రక్రియలో పాల్గొనే అభ్యర్థుల తరఫు ఏజెంట్లు ఎన్నికల కమిషన్‌ మార్గదర్శకాలను విధిగా పాటించాలని ఈఆర్వో జె.వెంకటరావు స్పష్టం చేశారు. స్థానిక కార్పొరేషన్‌ కార్యాయంలో మంగళవారం సాయంత్రం ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల తరపు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్‌లో ఏజెంట్ల పాత్ర, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. గుర్తింపు కార్డులు కలిగి ఉన్న కౌంటింగ్‌ ఏజెంట్లను మాత్రమే లోనికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఉదయం ఆరు గంటలకల్లా కౌంటింగ్‌ హాలుకు చేరుకోవాలని సూచించారు. కౌంటింగ్‌ హాలు లోపలకు పుస్తకం, పెన్నుతో సహా వేటినీ అనుమతించబోమని, అవసరమైతే తామే సమకూరుస్తామని తెలిపారు. ఎవరైనా ఫోన్‌ కాల్స్‌ చేయాలనుకుంటే నిర్దేశించిన జోన్‌లో మాత్రమే మాట్లాడాల్సి ఉంటుందని అన్నారు. ఈవీఎం, పోస్టల్‌ బ్యాలట్‌ లెక్కింపు ప్రక్రియ విధానాన్ని వివరించి, ఏజెంట్లు అడిగిన సందేహాలకు బదులిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్‌ గుంటూరు శేఖర్‌, ఏఆర్‌ఓ చల్లన్న దొర, ఇతర అధికారులు ఉన్నారు.

# గోపిశర్మ సిద్ధాంతి బృందానికి పురస్కారాలు



అవార్డులు అందుకున్న గోపిశర్మ

సామర్లకోట: పెద్దాపురానికి చెందిన వాస్తు సిద్ధాంతి చింతా గోపిశర్మకు వారి శిష్యబృందం సూర్యచంద్ర కల్చరల్‌ అండ్‌ సోషల్‌ సర్వీస్‌ ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో పలు అవార్డులను అందుకున్నారు. సోమవారం రాత్రి భారత వికాస్‌ పరిషత్తు చారిటబల్‌ ట్రస్టు, కూకట్‌పల్లి, హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వాస్తు బ్రహ్మ, వారి శిష్యులు చాడ హనుమశాస్త్రికి జ్యోతిష భూషణ్‌, ముక్కు సుబ్రహ్మణ్యానికి జ్యోతిష భూషణ్‌, భాగవతుల భవానీశర్మకు భారతీయవాస్తు సుధాకర, కవితా ఫణిశర్మకు జ్యోతిష ప్రవీణ, కామవరపు విజయమారుతి శర్మకు జ్యోతిష కేసరి, శర్మధకు జ్యోతిష ప్రవీణ అవార్డులు అందజేశారు.

# భగ్గుమన్న భానుడు

- ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- మంగళవారం 40 డిగ్రీల నమోదు



దాదాపు నిర్మానుష్యంగా ఉన్న కాకినాడ-యానాం ప్రధాన రహదారి

కాకినాడ సిటీ: జిల్లాలో ఎండలు మండుతున్నాయి. అల్పపీడనం, తుపాను ప్రభావంతో కొద్ది రోజులుగా ఎండ తీవ్రత తక్కువగానే ఉన్నా, సోమవారం నుంచి తీవ్రత పెరిగింది. రోహిణీ కార్తె ప్రారంభం కావడంతో భానుడి భగభగలు మరింత పెరుగుతాయని ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్నం 11 గంటల నుంచే వడగాల్పులు వీస్తున్నాయి. కాకినాడలో మంగళవారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాకినాడలోని ప్రధాన రహదారి, కాకినాడ-యానాం, కాకినాడ-పిఠాపురం, కాకినాడ-రామచంద్రపురం ప్రధాన రోడ్లు, ఇతర ప్రధాన సెంటర్లు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్మానుష్యంగా తయారయ్యాయి. ప్రారంభంలోనే ఎండల తీవ్రత అంతగా లేక అంతంత మాత్రంగా సాగినా ఏసీలు, ఎయిర్‌ కూలర్లు, ఫ్రిజ్‌ల విక్రయాలు గత నాలుగు రోజులుగా గణనీయంగా పెరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. జూన్‌ మొదటి వారం వరకు ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

**జీవనోపాధిపై ప్రభావం**

ఉష్ణోగ్రతలు పెరగడంతో చిరువ్యాపారుల జీవనోపాధిపై ప్రభావం పడుతోంది. తినుబండారాలు, రోడ్డు పక్కనే ఇతరత్రా వ్యాపారాలు సాగించే చిరు వ్యాపారులు ఎండ తీవ్రతకు వ్యాపారాలు చేయలేకపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే పలు కూడళ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వడగాల్పుల నేపథ్యంలో కనీస జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### టయోటా అర్బన్‌ క్రూజర్‌ టైసర్‌ విడుదల



వాహనాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

కాకినాడ రూరల్‌: టయోటా కిర్లోస్కర్‌ మోటార్స్‌ వాహనాల అధీకృత డీలర్‌ పృథ్వీ టయోటా తమ కాకినాడ షోరూమ్‌లో సరికొత్త టయోటా అర్బన్‌ క్రూజర్‌ టైసర్‌ వాహనాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఇది శక్తివంతమైన, అదనపు బలంతో పాటు, సమగ్ర పరిధి కలిగిన స్పోర్ట్స్‌ యుటిలిటీ వాహనంగా పేర్కొన్నారు. ఈ వాహనంలో ఒక లీటర్‌ టర్బో 1.2 లీటర్ల పెట్రోలు, ఈ సీఎన్జీతో పాటుగా ఫైర్‌ స్పీడ్‌ మాన్యువల్‌, సిక్స్‌ స్పీడ్‌ ఆటో ట్రాన్స్‌మిషన్‌ కలిగి ఉందని తెలిపారు. దీనిలో ప్రతిష్ఠాత్మకమైన, ఎంతో సుందరమైన ఎక్స్టీరియర్‌తో పాటు అంచనాలకు మించినటువంటి ఇంటీరియర్స్‌ కూడా కలిగి ఉందన్నారు. ఈ వాహనంలో వివిధ శ్రేణులలో 16 అంగుళాల ఎల్లాయిస్‌ ట్విన్‌ ఎల్‌ఈడీ ఆర్‌ట్టోన్‌ ఎక్స్టీరియర్‌ హెడ్‌ ఆఫ్‌ డిస్ప్లే, హెచ్‌డి డిస్ప్లే కాస్ట్‌ ఇన్ఫోటైన్మెంట్‌ సిస్టం 6 ఎయిర్‌ బ్యాగ్స్‌ వంటి అధునాతన, భద్రతా ప్రమాణాలు కలిగివుందని చెప్పారు. ఈ వాహనం ధర రూ.7,73,500 నుండి ప్రారంభమవుతుందని, మైలేజ్‌ 22.8 కిలోమీటర్లు ఈ సీఎన్జీ వేరియంట్‌లో 28.5 కేఎంపీఎల్‌ ఫర్‌ కేజీగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఆర్టీవో మురళీకృష్ణ, టయోటా ఏరియా మేనేజర్‌ శశికాంత్‌, పృథ్వీ మోటార్స్‌ ఎండీ పృథ్వీచంద్ర, సీఈవో కిరణ్‌కుమార్‌తో పాటు కంపెనీ సిబ్బంది, ముఖ్య అతిథులు హాజరయ్యారు.

# నియోజకవర్గంలో నాకాబందీ

- రికార్డులు లేని వాహనాలు పోలీసు స్టేషన్‌కు తరలింపు



సామర్లకోటలో వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ లతాకుమారి, ఎస్సై మౌనిక

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాలలోని ముఖ్య కూడళ్లలో మంగళవారం నాకాబందీ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గం అంతా ఒకేసారి ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనాలను ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. సామర్లకోట సీబీఎం సెంటర్‌లో డీఎస్పీ కె.లతాకుమారి ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. వాహన చోదకుల వద్ద తప్పని సరిగా రికార్డులు ఉండాలని ఆమె పేర్కొన్నారు. సెల్‌ ఫోన్‌లో రికార్డులు చూపినా సరిపోతుందని చెప్పారు. ఎటువంటి రికార్డులు, గుర్తింపు కార్డులు చూపకపోతే పోలీసు స్టేషన్‌కు వాహనాలను తరలిస్తామని, పోలీసు స్టేషన్‌లో వాహన చోదకులు రికార్డులను చూపించి వాటిని తీసుకు వెళ్లవచ్చని పేర్కొన్నారు. సామర్లకోటలో రైల్వే స్టేషన్‌ సెంటర్‌, పోలీసు రింగ్‌ సెంటర్‌, గాంధీ చౌక్‌, బళ్ల మార్కెట్‌, బ్రౌన్‌పేట, సీబీఎం సెంటర్‌, ప్రసన్నాంజనేయస్వామి టెంపుల్‌, మెహర్‌ కాంప్లెక్స్‌, మఠం సెంటర్‌లలో వాహనాలను తనిఖీ చేశారు. అదే విధంగా పెద్దాపురం పట్టణ పరిధిలో మున్సిపల్‌ సెంటర్‌, సంతమార్కెట్‌ సెంటర్‌, మరిడమ్మ టెంపుల్‌, కాండ్రకోట రోడ్డు జంక్షన్‌, గుర్రాల సెంటర్లలో, ఆయా గ్రామాల కూడళ్లలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పెద్దాపురం పోలీసు సబ్‌ డివిజన్‌ పరిధిలో సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు పాల్గొన్నారు.